## క్లుప్తంగా

### సర్టిఫికెట్ల పరిశీలన రేపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పారామెడికల్ కోర్సుల్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను శనివారం పరిశీలించనున్నామని డీఎంహెచ్‌ఓ పెంచలయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో నగరంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి ఉదయం పది గంటలకు హాజరుకావాలని సూచించారు.

### పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ



నెల్లూరు రూరల్: పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీని కొండ్లపూడి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగించే సంభవించే అనర్థాలను వివరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

### 8న 'కళ' వార్షికోత్సవ వేడుకలు

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో కళ పదో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం నిర్వహించనున్నామని సంస్థ నిర్వాహకుడు మహ్మద్ రఫీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ హాస్యనటుడు అలీ హాజరుకానున్నారని చెప్పారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

### సాయిసచ్చరిత్ర పారాయణంతో జన్మసార్థకం



ప్రవచిస్తున్న వేదవతి

నెల్లూరు(బృందావనం): సాయిసచ్చరిత్ర, గురుచరిత్ర, లీలామృత గ్రంథాల పఠనంతో జన్మసార్థకమవుతుందని ఆడిదం వేదవతి ప్రవచించారు. బాలాజీనగర్ శివారు పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో సాయితత్వంపై గురువారం ఆమె ప్రవచించారు. తొలుత మందిరంలో కొలువైన సాయినాథుడికి పూజలు చేశారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి, సాయిదర్బార్ గౌరవ సలహాదారు రామసుబ్బయ్య పర్యవేక్షించారు.

### పన్నుల వసూళ్లలో లక్ష్యాన్ని సాధించాలి



మాట్లాడుతున్న హరిత

నెల్లూరు సిటీ: ఆస్తి, కుళాయి పన్నుల వసూళ్లలో రెవెన్యూ అధికారులు లక్ష్యాన్ని సాధించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ విభాగాధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తమ పరిధిలో నిర్దేశించిన లక్ష్యాన్ని నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. ప్రతి భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకురావాలని, బకాయిదారులకు నోటీసులను జారీ చేయాలని ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన యూజర్ చార్జీలను వసూలు చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ ఆఫీసర్లు సమద్, శ్రీనివాసులు, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

### కేవీ రెడ్డికి నివాళులు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): అనారోగ్యంతో మృతి చెందిన విశ్రాంత డీఎంహెచ్‌ఓ కేవీ రెడ్డికి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగ సంఘ నేతలు గురువారం నివాళులర్పించారు. హరనాథపురంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి రిటైర్డ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు హరిబాబు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, శ్రీనివాసులు, విద్యాసాగర్‌రావు, ఇందిర, వైద్యులు కృష్ణమూర్తి, మున్వర్ సుల్తానా, మస్తానయ్య, కామేశ్వరి, రాజసులోచన, ఆరోగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

- ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ప్రతి డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ ప్రజల్లోకి వెళ్తున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. తొమ్మిదో డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీ, కృష్ణానగర్, కార్తీక్ స్కూల్ వీధి, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను ఆరాతీసి.. పరిష్కరించే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్లో ఐదు పార్కులకు శంకుస్థాపన చేయగా, ఒక పార్కును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. మిగిలినవి పూర్తయ్యే దశలో ఉన్నాయన్నారు. డివిజన్లో విద్యుత్ స్తంభాలు, దీపాలు, డ్రెయిన్ల పనులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. డివిజన్లో సుమారు రూ.8 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టనున్నామని వెల్లడించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# బాలినేనికి ఘన సన్మానం





నెల్లూరు సిటీ: నగరంలోని మెడికవర్ హాస్పిటల్ జంక్షన్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డికి నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు.

నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి సత్కరించారు. రూరల్ పరిధిలోని పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కనుపర్తిపాడు జంక్షన్‌కు చేరుకొని శ్రీనివాసరెడ్డికి స్వాగతం పలికారు. కమలాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సునీల్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాసులురెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌తో ఇల్లు భద్రం

- సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): సంక్రాంతికి ఊరెళ్తున్నారా.. అయితే ఇంటి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిందే. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని దొంగలు చెలరేగుతారు. గతేడాది జిల్లాలో పగలు 45.. రాత్రి 245 చోరీలు జరిగాయి. సంక్రాంతి సందర్భంగా ఊళ్లకెళ్లేవారు పలు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇళ్లలో చోరీల నియంత్రణకు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎమ్మెస్)ను పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. దీన్ని వినియోగించి ఇంటిని మీరే కాపాడుకోవచ్చు. ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో ఎల్‌హెచ్‌ఎమ్మెస్, ఏపీ పోలీస్ సేవాయాప్‌ను రిజిస్టర్ చేసుకోవాలి. ఇల్లు విడిచి ఊరెళ్లే సమయంలో యాప్‌లో వాచ్ రిక్వెస్ట్ పెట్టాలి. తద్వారా చోరీలను అడ్డుకోవచ్చు. సంక్రాంతి సందర్భంగా ఊళ్లకెళ్లేవారు యాప్ సేవలను వినియోగించుకోవాలని పోలీస్ అధికారులు కోరుతున్నారు.

**రిక్వెస్ట్ పోలీస్ వాచ్**

- ఇళ్లకు తాళం వేసి ఊరెళ్లే వారు యాప్‌లో రిక్వెస్ట్ పోలీస్ వాచ్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఇందులో యూజర్ ఐడీని నమోదు చేయాలి. ఎప్పుడు ఊరెళ్తున్నారు.. సమయం, తిరిగొచ్చే తేదీని టైప్ చేసి సబ్మిట్ వాచ్ రిక్వెస్ట్‌పై క్లిక్ చేయాలి.
- అభ్యర్థనను నమోదు చేసిన వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్‌కు సందేశం వెళ్తుంది. అక్కడి సిబ్బంది సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వివరాలను అందజేస్తారు.

**కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం**

పోలీసులే ఇంటికి చేరుకొని వైర్‌లెస్‌తో కూడిన మోషన్ కెమెరా, మోడెమ్‌ను రహస్య ప్రదేశంలో అమరుస్తారు. దీన్ని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తారు. కంట్రోల్ రూమ్‌లోని సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు సైతం ఆ ఇంటిపై నిఘా ఉంచుతారు. ఆండ్రాయిడ్ ఫోన్ లేని వారూ ఈ సేవలను వినియోగించుకోవచ్చు. అయితే సదరు వ్యక్తులు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం అందిస్తే, ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌ను అమరుస్తారు.

**అడుగుపెడితే ఇట్టే దొరికేస్తారు..**

ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌ను అమర్చిన ఇంట్లోకి ఎవరైనా ప్రవేశించినా.. ఏవైనా కదలికలు నమోదైనా కెమెరా వెంటనే ఫొటోలను రికార్డ్ చేసి కంట్రోల్ రూమ్, యూజర్‌కు సంకేతాలు పంపడంతో పాటు అలారమ్ మోగుతుంది. అక్కడి నుంచి లొకేషన్‌ను బట్టి సంబంధిత స్టేషన్‌కు సమాచారం అందుతుంది. నిమిషాల వ్యవధిలోనే పోలీసులు సులువుగా ఇంటి వద్దకు చేరుకొని నిందితులను పట్టుకుంటారు.

**యాప్ డౌన్‌లోడ్ ఇలా..**

- గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఏపీ పోలీస్ పేరిట కనిపించే యాప్‌ను ఇన్‌స్టల్ చేసుకోవాలి.
- యాప్‌ను ఓపెన్ చేసి సిటిజన్ అనే చోట పేరు, చిరునామా, మొబైల్ నంబర్‌తో పాటు గూగుల్ మ్యాప్‌ను అటాచ్ చేయాలి. వెంటనే మనమిచ్చిన ఫోన్ నంబర్‌కు వచ్చిన నాలుగు అంకెలున్న ఓటీపీని టైప్ చేయాలి. దీంతో యూనిక్ యూజర్ ఐడీ జనరేటై రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది.

**సేవలు పూర్తిగా ఉచితం**

ఎల్‌హెచ్‌ఎమ్మెస్ సేవలు పూర్తిగా ఉచితం. గూగుల్ ప్లే స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్టర్ చేసుకోండి. ఇల్లు విడిచి ఊళ్లకెళ్లే సమయంలో యాప్‌లో రిక్వెస్ట్ పోలీస్ వాచ్ పెడితే ఇంట్లో కెమెరాను రహస్య ప్రదేశంలో ఏర్పాటు చేస్తాం. సేవలను అందరూ సద్వినియోగం చేసుకోండి.


– శ్రీనివాసరెడ్డి, నగర డీఎస్పీ

# కర్మక్రియల భవనానికి శంకుస్థాపన



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అన్ని వసతులతో కర్మక్రియల భవనాన్ని నిర్మించనున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని 48వ డివిజన్లో గల జయలలితనగర్‌లో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.50 లక్షలతో నిర్మించనున్న కర్మక్రియల భవనానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఒకేసారి ఐదు పార్థివదేహాలకు సంబంధించిన కర్మక్రియలు చేసుకునేలా భవనాన్ని నిర్మించనున్నామని చెప్పారు. అద్దె గృహాల్లో ఉంటున్న వారి సౌకర్యార్థం పార్థివదేహాన్ని ఉంచుకునేందుకు వీలుగా మరో భవనాన్ని త్వరలో నిర్మించనున్నామని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు కరిముల్లా, జయలక్ష్మి, వేలూరు మహేష్, 48, 49వ డివిజన్ల ఇన్‌చార్జీలు సిద్ధిఖ్, రంగ, తదితరులు పాల్గొన్నారు.

### పరీక్ష కేంద్రాల్లో పరిశీలన



కొడవలూరు: ఒకటి నుంచి పది తరగతుల విద్యార్థులకు జరుగుతున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్-1(ఎస్‌ఏ-1) పరీక్ష కేంద్రాలను ఎంఈఓ జి.వసంతకుమారి గురువారం పరిశీలించారు. మండలంలోని నార్తురాజుపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 376 మంది 6 నుంచి 10 తరగతుల విద్యార్థులు, స్థానిక ప్రధాన ప్రాథమిక పాఠశాలలో 104 మంది విద్యార్థులు ఎస్‌ఏ-1 పరీక్ష రాస్తున్నారు. ఈ కేంద్రాలను ఎంఈఓ పరిశీలించారు. ఆమె వెంట జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి.ఓబులేసు, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సి.మోహన్‌రావు ఉన్నారు.

### వాణిజ్య మొక్కల పెంపకానికి ఏర్పాట్లు

నెల్లూరు(బారకాసు): అటవీ ముఖ్య పర్యవేక్షకుల ఆదేశాలతో వాణిజ్య మొక్కల పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నామని సామాజిక వన విభాగ డీఎఫ్‌ఓ శ్రీనివాసులు వెల్లడించారు. పొదలకూరురోడ్డులోని సామాజిక వన విభాగ జిల్లా కార్యాలయంలో సంబంధిత అటవీ అధికారులతో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక వన విభాగ ఆధ్వర్యంలో వాణిజ్య నర్సరీలను పెంచేందుకు తగు చర్యలు చేపట్టామన్నారు. వెంకటాచలం, సంగం, కడనూతల నర్సరీల్లో ప్రజలకు అవసరమైన అటవీ, అటవీయేతర, పర్యావరణ రహిత అరుదైన మొక్కలను పెంచనున్నామని పేర్కొన్నారు. మొక్కలు పెంచుకోవాలనే ఆసక్తి ఉన్న వారు తమ నర్సరీల నుంచి పొందవచ్చని తెలిపారు.

### పేదలకు దుప్పట్ల అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బోడిగాడితోట, కోవూరులోని చెరువుకట్ట వద్ద నివాసం ఉంటున్న పేదలకు దుప్పట్లను ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. నిర్వాహకురాలు పర్వీన్, షౌకత్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

### కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): కారు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి గాయపడిన ఘటన బుజబుజనెల్లూరు దర్గా ఎదురుగా గల జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. రోడ్డు దాటుతున్న వ్యక్తిని గూడూరు వైపు వెళ్తున్న కారు వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. ఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చికిత్స నిమిత్తం క్షతగాత్రుడ్ని జీజీహెచ్‌కు తరలించారు. స్థానికంగా భిక్షాటన చేసుకొని జీవనం సాగిస్తున్నారని స్థానికులు తెలిపారు.

### నియామక పత్రాల అందజేత



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆర్టీసీలో విధులు నిర్వర్తిస్తూ మృతి చెందిన ముగ్గురు ఉద్యోగుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలను కల్పించారు. ఉదయగిరి సచివాలయం – 1లో వెంకటసుధీర్, బుచ్చిరెడ్డిపాళెం సచివాలయం – 2లో సూర్యప్రకాష్, ఇందుకూరుపేట సచివాలయం బిట్ 1 / 2లో ఉమాదేవిని వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లుగా నియమించారు. కలెక్టర్ చక్రధర్‌బాబు ఉత్తర్వుల మేరకు నియామక పత్రాలను జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య చేతుల మీదుగా అందజేశారు.

### ధనలక్ష్మీపురంలో రక్తదాన శిబిరం



నెల్లూరు రూరల్: రక్తదానాన్ని ప్రోత్సహించాలని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. ధనలక్ష్మీపురంలో విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని మేయర్ స్రవంతితో కలిసి ప్రారంభించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని చెప్పారు.

### ఫ్యాప్టో కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు (టౌన్): నగరంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఫ్యాప్టో నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర నేత రమణయ్య ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సురేంద్రరెడ్డి (ఏపీటీఎఫ్ – 1938), సెక్రటరీ జనరల్‌గా రమేష్ (బీటీఏ), కో చైర్మన్లుగా మురళీకృష్ణ (డీటీఎఫ్), హమీద్ (ఆర్‌యూటీఏ), డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా శేషు (యూటీఎఫ్), ఏడుకొండలు (ఎస్టీయూ), హజరత్ (ఏపీటీఎఫ్ – 257), కార్యదర్శులుగా చలపతి (హెచ్‌ఎంఏ), మధుసూదన్‌రావు (ఏపీపీటీఏ) ఎన్నికయ్యారు. నేతలు చిరంజీవి, వేణుగోపాల్, నవకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం



ఆశీస్సులను అందుకుంటున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: సమస్యలకు పరిష్కారం చూపడమే తన లక్ష్యమని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 17, 18వ డివిజన్లలో గురువారం నిర్వహించిన తటస్థుల దీవెన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని తటస్థుల సూచనలు, సలహాలతో ప్రజల్లోకి వెళ్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వచ్చే తత్వం తనదికాదన్నారు. సమావేశానికి హాజరైన వారి నుంచి ఆశీస్సులను అందుకున్నారు. అనంతరం వారితో కలిసి ఆత్మీయ విందుకు హాజరయ్యారు. కార్పొరేటర్లు సుధాకర్, అశోక్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం



నెల్లూరు(లీగల్): తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మద్దతుగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ప్రచారాన్ని గురువారం నిర్వహించారు. నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి మాట్లాడారు. శాసనమండలి ఎన్నికల్లో మొదటి ప్రాధాన్య ఓటును శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. న్యాయవాదులు పద్మాకర్, రంగారావు, సలీమ్, నరసయ్య, మునిరెడ్డి, లతీఫ్, సాయి, షఫీ అహ్మద్, చైతన్య, సునీత, షకీల్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నెల్లూరు సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గృహాలను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో హౌసింగ్ కార్పొరేషన్ అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యుత్, తాగునీరు, వీధిదీపాలు, డ్రెయిన్లు, రోడ్లు, తదితరాలను పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. హౌసింగ్ కార్పొరేషన్ డీఈలు దయాకర్, శ్రీహరి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా రంగవల్లుల పోటీలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఇందిరాభవన్‌లో రంగవల్లుల పోటీలను గురువారం నిర్వహించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు లతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీ అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. శ్రీనివాసులురెడ్డి, అల్లావుద్దీన్, గణేష్‌బాబు, హుస్సేన్, మోహన్‌రెడ్డి, రిజ్వానా, అలీమా, తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా ఊంజల్‌సేవ



నెల్లూరు(బృందావనం): అధ్యయనోత్సవాల్లో భాగంగా నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో రాపత్తు ఉత్సవాన్ని వేడుకగా గురువారం నిర్వహించారు. ఉభయదేవేరులతో కొలువైన రంగనాథుడికి ఉత్తరద్వార ప్రవేశం వద్ద ఊంజల్‌సేవను వేడుకగా జరిపారు. ఏఎస్పీ హిమవతి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలను ఆమెకు అందజేశారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్‌ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

# కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డికి సన్మానం



నెల్లూరు రూరల్: వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని నియమించడంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకొన్నారు. 18 పంచాయతీలు, 26 డివిజన్ల పార్టీ నేతలు, కార్యకర్తలు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చేరుకున్నారు. భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం గిరిధర్‌రెడ్డిని సత్కరించారు. నేతలు కమలాకర్‌రెడ్డి, మురళీకృష్ణయాదవ్, చక్రవర్ధన్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

- వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని నగరంలోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి అభినందించారు. కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సజ్జల దృష్టికి ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలు



సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): ప్రైవేట్ విద్యాసంస్థల యజమానులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి విజయవాడలో తెలియజేశామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడారు. ప్రైవేట్ స్కూళ్లకు ఉన్న మూడేళ్ల గుర్తింపును పదేళ్లకు పెంచాలని కోరగా, వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇంజినీరింగ్, పీజీ కోర్సుల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ పాత బకాయిలను పేరెంట్స్ ఖాతాల్లో కాకుండా విద్యాసంస్థలకే నేరుగా అందించాలని కోరామన్నారు. ఈ విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ నేత జాలిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో అపార్ట్‌మెంట్‌లో సమావేశం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలోని టిడ్కో అపార్ట్‌మెంట్లలో నివసిస్తున్న ప్రజల సంక్షేమం కోసం రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆర్‌డబ్ల్యూఏ)ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని మెప్మా సీఎంఎం కాంతయ్య పేర్కొన్నారు. నగరంలోని 54వ డివిజన్ భగత్‌సింగ్‌కాలనీలో గల టిడ్కో అపార్ట్‌మెంట్లలో గురువారం నిర్వహించిన ఆర్‌డబ్ల్యూఏ సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడ్కో నివాసాల వద్ద తలెత్తే సమస్యలను పరిష్కరించడం.. స్థానికుల సంక్షేమానికి ఆర్‌డబ్ల్యూఏలు పనిచేస్తాయన్నారు. అనంతరం 15 మందితో అసోసియేషన్‌ను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 54వ డివిజన్ ఇన్‌చార్జి ముజీర్, మెప్మా సీఓ ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.